నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం సాయంత్రం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాల్లోపు వయస్సు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పోటెత్తిన గోదావరి

జల దిగ్బంధంలో లంక గ్రామాలు
నిండుకుండల్లా ప్రధాన కాలువలు
నీట మునిగిన నారుమడులు, తమలపాకు, కూరగాయల తోటలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి ఉరకలేస్తోంది. ఆదివారం సాయంత్రం నాటికి కోడేరు వద్ద వశిష్ట గోదావరి వరద ఉధృతి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మండల ప్రత్యేక అధికారి డి.వీరాస్వామి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ జగన్నాధరావు లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా 10 క్వింటాళ్ల బియ్యం, ఏడు బస్తాల కందిపప్పు, తొమ్మిది బస్తాల పంచదార, 20 గ్యాస్ సిలిండర్లతోపాటు నిత్యావసర సరుకులు ఇంజిన్ పడవపై తరలించారు. లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెదమల్లంలోని పర్యాటక కేంద్రం, ప్రసిద్ధిగాంచిన మాచేనమ్మ ఆలయాలు వరద తాకిడికి గురయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. అయితే భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టడంతో సోమవారం సాయంత్రం నుంచి గోదావరి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లంక గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉందని జనం వాపోతున్నారు. వరద ఉధృతికి పెద్దఎత్తున పాములు లంకల్లోకి వస్తున్నాయని, ఎప్పుడు.. ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. లంక గ్రామాలకు 80 వేల వాటర్ ప్యాకెట్లు సరఫరా చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎం.మూర్తిరాజు తెలిపారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా వాటర్ ప్లాంట్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

ఆచంట మండలం కోడేరు వద్ద వరద ఉధృతికి కోతకు గురవుతున్న ఏటిగట్టు

ఆచంట మండలలో ముంపులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధిలోని పెదమల్లం లంక, ఆనగార్లలంక, కోడేరు పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధిలోని అయోధ్యలంక, మర్రిమూల, పుచ్చల్లంక, నకిడిలంక, రాయిలంక, పెదపేట, వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఉపాధి లేక నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించడంతో అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెవిన్యూ అధికారులు వీరికి రెండు పూటలా భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. భీమలాపురం ఏటిగట్టు దిగువన ఉన్న కాపులపాలెంను వరద నీరు చుట్టుముట్టింది. ప్రధాన రహదారి నీట మునిగింది. దిగివన ఉన్న కాజ్‌వే పైనుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. పలు అంతర్గత రహదారులు నీట మునిగిపోవడంతో రెండు రోజులుగా ఆ నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ సుమారు వంద కుటుంబాలు వరద తాకిడికి గురయ్యాయి. కాపులపాలెంలో వరద నివాసాలను చుట్టుముట్టడంతో అక్కడ నుంచి 10 కుటుంబాలను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.రాజకుమార్ తెలిపారు.

నీట మునిగిన పంటలు

లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించడంతో కూరగాయలు, అరటి, వంగ, బెండ, బీర, ఆనబ, చిక్కుడు, పచ్చిమిర్చి తోటలతోపాటు ఆకుకూరలు, తమలపాకు తోటలు నీట మునిగాయి. పశువుల పాకలు, పచ్చగడ్డి ముంపుబారిన పడటంతో పశువుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది.

యలమంచిలి: గోదావరి వరద మరింత ఉగ్రరూపం దాల్చడంతో మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల తదితర గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇళ్ల నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. దొడ్డిపట్ల హైస్కూలు, తాటిపాక గ్రామంలోని కళ్యాణ మండపంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినా ప్రజలు రావడానికి ఇష్టపడటం లేదని తహశీల్దార్ ఎం.సునీల్‌బాబు తెలిపారు. వరద మరికాస్త పెరిగితే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న దృష్ట్యా వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

సిద్దాంతం రేవు వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎస్‌పి

వరద ఉధృతిని పరిశీలించిన ఎస్‌పి

పెనుగొండ : గోదావరి వరద ఉధృతిని జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ ఆదివారం పరిశీలించారు. సిద్ధాంతం చేరుకున్న ఆయన రేవు వద్ద నుంచి గోదావరి వరదను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిద్ధాంతం లంక, నడిపూడి లంకల్లో ఎవరైనా నివాసమున్నారా అని ఆరా తీశారు. అక్కడ ప్రజలెవరూ లేరని, పశువులు మాత్రమే ఉన్నాయని సిబ్బంది తెలిపారు. వెంటనే ఆ పశువులను ఏటిగట్టుకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎస్‌పి వెంట నరసాపురం డిఎస్‌పి కె.రవి మనోహరాచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ రమేష్, సర్పంచ్ చింతపల్లి గన్నరాజు, సిబ్బంది ఉన్నారు.

పొంగిపొర్లుతున్న కాలువలు
ముంపులో నారుమడులు, తమలపాకు తోటలు

గోదావరి వరద ప్రభావంతో మండలంలోని నక్కల డ్రెయిన్, కాజ డ్రెయిన్లతోపాటు వాటికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలు సైతం పొంగిపొర్లడంతో ఆయా కాలువల వెంబడి ఉన్న పంట పొలాలు నారుమడులు పూర్తిగా నీట మునగడంతోపాటు కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, బూరుగుపల్లి, కెఎస్ పాలెం తదితర గ్రామాల్లోని లంకల్లో ఉన్న తమలపాకు తోటలు సైతం నీట మునిగాయి. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

యలమంచిలి మండలంలో వరద బాధితులు

మరింత పెరిగిన కూరగాయల ధరలు
వరదల ప్రభావం

పాలకొల్లు: గత 10 రోజులుగా గోదావరి వరదలు, భారీ వర్షాలు నేపథ్యంలో కూరగాయల ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. సాధారణంగా పచ్చిమిర్చి, వంకాయలు, బీర, బెండ, పొట్లకాయ, ఆనప, మునగ వంటి కూరగాయలు లంక గ్రామాల్లో సాగు చేస్తారు. ఇప్పటికే పచ్చిమిర్చి కిలో రూ.160కు చేరి ప్రస్తుతం రూ.100కు తగ్గింది. వంకాయిలు, బెండ తిరిగి కిలో రూ.వందకు చేరాయి. మునగకాడ చిన్నది రూ.పది నుంచి రూ.15 వరకూ అమ్ముతున్నారు. ఆనపకాయ తిరిగి రూ.40 నుంచి రూ.50 మధ్య పలుకుతోంది. వేసవిలో పెరిగిన కూరగాయల ధరలు జులై మొదటి వారంలో కొంచెం తగ్గుముఖం పట్టాయి. అయితే వరదల నేపథ్యంలో మళ్లీ ధరలు పెరిగాయి. టమోటాలు డబుల్ సెంచరీ బాటలోనే ఉన్నాయి.

విస్సాకోడేరులో ర్యాలీ

మణిపూర్‌లో మారణహోమంపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఉండి

మణిపూర్ మారణహోమానికి కారకులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉండి గోరింతోట ప్రాంతంలో మణిపూర్ మారణహోమంపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలు అత్యంత దారుణమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అక్కడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దీనికి బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై ప్రపంచ దేశాలు సైతం స్పందిస్తున్నా మన రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన స్పందించకపోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో అన్నవరం, రామకూరి వెంకటరత్నం, మునకాల రాజు, కొల్లి రత్నకుమారి, మేడిది రత్నకుమారి, బొడ్డు మేరీ తదితరులు పాల్గొన్నారు.

కాళ్ల: మణిపూర్‌లో శాంతిభద్రతలు పరిరక్షించి, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ మైనారిటీ అధ్యక్షులు మేడిది జాన్సన్ అన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు నిరసనగా జక్కరం నుంచి కాళ్ల పోలీస్ స్టేషన్ వరకు కాళ్ల మండల క్రిస్టియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జక్కరంలో మేడిది జాన్సన్ శాంతి కపోతాలను ఎగురవేశారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. కాళ్లలో పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్లలో ర్యాలీ అనంతరం వినతి అందజేత

ర్యాలీలో లూథరన్ సంఘాలు, మండల పాస్టర్స్ ఫెలోషిప్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్, సిబిసిఎన్‌సి, సిఎస్ఐ, పెంతుకోస్తు తదితర క్రైస్తవ సంఘాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమానికి చిలకపాటి సుందర్, దొండపాటి రవిచంద్రన్, జిడి.కరుణాకర్, గుర్రం బెన్వర్, అశోక్, సత్యం, శేఖర్, ఆర్ఎస్.రాజు, ఎం.ఇజ్రాయిల్, సిరింగి బాల నేతృత్వం వహించారు. ర్యాలీ అనంతరం కాళ్ల ఎస్ఐ ఎజిఎస్.మూర్తికి వినతిపత్రం అందజేశారు.

పాలకోడేరు: విస్సాకోడేరు దళిత క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మణిపూర్ హింసకాండను నిరసిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. పెన్నాడ అగ్రహారం చినపేట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ 216 జాతీయ రహదారి గుండా గొరగనమూడి, విస్సాకోడేరు మీదుగా గోపీకృష్ణ థియేటర్ వరకు సాగింది. ఈ ర్యాలీలో పాస్టర్లు, దళిత క్రైస్తవులు, క్రైస్తవ సోదరులు, మహిళలు వందలాదిమంది పాల్గొని మణిపూర్ ఘటనకు కారకులను శిక్షించాలని, మోడీ గద్దె దిగాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత ముఖ్య నేతలు దుండి అశోక్‌బాబు, పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ మణిపూర్ మారణహోమం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనకు కారణమైన బిజెపి ప్రభుత్వం ఇప్పటివరకు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు.

ఉండిలో సిపిఎం నిరసన

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఉండి

ఉండి కుర్మా వారి వీధి నుంచి గోరింతోట వరకు ఉన్న జాతీయ రహదారికి ఆర్‌ఒబి కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టారు. రహదారి గుంతలమయంగా ఉందని సొగసు చూడతరమా శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఆదివారం ఉండి కుర్మా వారి వీధి నుండి గోరింతోట వరకు ఉన్న జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టారు.

యంత్రాలతో చేపట్టిన మరమ్మతులు

నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి నాగార్జున

అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా జగన్ పాలన

మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని ఆరుగొలనులో సుమారు రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయం నూతన భవనాల సముదాయాన్ని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కొట్టు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి నాగార్జున మాట్లాడుతూ దేశంలోనే విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రం మనదేనన్నారు. విద్య తర్వాత వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తాను వంగవీటి రంగాకు శిష్యుడిగా ఉండేవాడినని, రంగా ఒక కులానికి చెందిన వాడు కాదని, అందరివాడని మంత్రి అన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా విజయవాడ నడిబొడ్డున 19 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్ల వ్యయంతో 125 అడుగులు ఎత్తు అంబేద్కర్ విగ్రహంతో అంబేద్కర్ స్మృతి వనాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆరుగొలను గురుకులానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తూ రూ.ఏడు కోట్లు ఎఫ్‌డిఆర్ నిధులతో నవాబుపాలెం నుంచి ఆరుగొలను కొత్తూరు మీదుగా దండగర్రకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు నిర్మిస్తున్నామని ప్రకటించారు.

80 సెంట్లు స్థలంలో కాపు భవనం నిర్మించబోతున్నామన్నారు. 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం, నన్నయ క్యాంపస్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, మల్టీస్పెషాల్టీ చిల్డ్రన్ హాస్పిటల్ తాడేపల్లిగూడెంలో నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా వీటికి శంకుస్థాపన చేస్తామన్నారు. పెదతాడేపల్లి గురుకుల విద్యాలయానికి కూడా సొంత భవనాలు నిర్మించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జునను కోరారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఆరుగొలను గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి శేషులత, మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్‌కుమార్, వైసిపి యువ నాయకులు కొట్టు విశాల్, వైస్ ఎంపిపిలు సుర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, ఆరుగొలను సర్పంచి పీతల బుచ్చిబాబు, ఎంపిటిసి నార్ని శంకర్రావు, డిసిఒ భారతి, పెద్ద తాడేపల్లి గురుకులం ప్రిన్సిపల్ భీమడోలు రాజారావు, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరద ముంపులో 21 గ్రామాలు

మెరుగైన వసతులతో 4 పునరావాస కేంద్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పునరావాస కేంద్రాలను మెరుగైన వసతులతో సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి, ఆచంట, నరసాపురం మండలాల్లోని 21 లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 2,144 కుటుంబాలకు చెందిన 12,806 మంది నివశిస్తున్నారని తెలిపారు. నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 133 మంది గర్భిణులను, 138 మంది బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు 25 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 426 కుటుంబాలకు అవసరమైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నాటికి ఒక్కొక్కరికి ఐదు కిలోలు చొప్పున 106.50 క్వింటాళ్ల బియ్యం, ప్రతి కుటుంబానికీ ఒక్కొక్క కిలో చొప్పున కందిపప్పు, పామాయిల్,

ఉల్లిపాయలు, బంగాళదుంపలు ఒక్కొక్కటి 426 కిలోలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖ నుండి 5 టీములు, 40 లైఫ్‌జాకెట్లను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 15 ఇంజిన్ బోట్లు, 8 కంట్రీ బోట్లను మొత్తం 23 బోట్లను సిద్ధం చేశామని తెలిపారు. శనివారం 50 వేల వాటర్ ప్యాకెట్లను, ఆదివారం 90 వేల వాటర్ ప్యాకెట్లను మొత్తం లక్షా 40 వేల వాటర్ ప్యాకెట్లను సరఫరా చేశామని పేర్కొన్నారు. పాము కాటు కారణంగా ఒక దూడ చనిపోయిందని తెలిపారు. 292.52 కిలోమీటర్ల మేర రోడ్లు ఉపరితలం దెబ్బతిన్నాయని, వాటిలో స్టేట్ హైవేలు 76.70 కిలోమీటర్లు, జిల్లా హైవే రోడ్లు 214.82 కిలోమీటర్ల మేర ఉన్నాయని పేర్కొన్నారు. భీమవరం డివిజన్ పరిధిలో అధిక వర్షాల కారణంగా ఇప్పటివరకు మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 121 గ్రామాల పరిధిలోని 158.82 హెక్టార్లలో వరి నారుమళ్లు, 1,963.12 హెక్టార్లలో వరి నాట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. 48 మంది రైతులకు సంబంధించి 18 హెక్టార్లలో అరటి పంట, 154 మంది రైతులకు సంబంధించి 57 హెక్టార్లలో కాయగూరల పంటలు, 85 మంది రైతులకు సంబంధించి 25.50 హెక్టార్లలో తమలపాకు పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాకపోకలు స్తంభించిన గ్రామాల ప్రజలకు బోట్ల ద్వారా నిత్యావసరాలు అందిస్తున్నామని తెలిపారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని, వరద పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేవరకు అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవలందించాలని ఆదేశించినట్లు తెలిపారు.

వైసిపి ప్రభుత్వ విధానాల వల్లే సంక్షోభంలో గీత వృత్తి

తరాలు మారుతున్నాయి.. కానీ గీతన్నల రాతలు మార్చే పాలకులు రావడం లేదు. వారి వృత్తికి సరైన గ్యారంటీ లేదు. జీవితాలకు భద్రత లేక కటుంబాలు అగమ్యగోచరంగా ఉన్నాయి. దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం గీతన్నలను గాలికొదిలేసింది. గీత వృత్తినే నమ్ముకున్న కుటుంబాలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. గీతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో నాలుగు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వ సహకారం లేకపోయినా, ప్రమాదకరమైన వృత్తి అయినా కుటుంబ పోషణ కోసంవృత్తి చేస్తున్నారు. ఈ వృత్తిలో ప్రతియేటా వందలాది మంది ప్రమాదాలకు గురవుతున్నారు. అనేక మంది చనిపోతున్నారు. కాళ్లు, చేతులు విరగడం, నడుం పడిపోవడం జరుగుతున్నాయి. వృత్తిలో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటూనే గీతకార్మికులు ధైర్యంగా ముందుకెళ్తున్నారు. రాజకీయ పార్టీలు ఇప్పుడైనా గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం.. గీత కార్మికులకు ఇన్ని ప్రమాదాలు జరిగినా గుర్తించకపోవడం బాధాకరం.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో మోకు భుజాన వేసుకుని గీత కార్మికులకు ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా వృత్తిని దారుణంగా దెబ్బతీశారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశైన, యాత ఒక్కటిగా ఉన్న కల్లు గీత కులాలను చీల్చి అప్పులు తెచ్చుకోవడం కోసం కులాలవారీ కార్పొరేషన్లు పెట్టి ఛైర్మన్లు, డైరెక్టర్లను నామినేట్ చేసి కొంతమందికి రాజకీయ భృతి కల్పించారు. నిధులు, విధులు లేని కులాల కార్పొరేషన్లు గీత కార్మికుల కొంపలు ముంచడానికి తప్ప వాటివల్ల ఎటువంటి ఉపయోగమూ లేదు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వృత్తిలో ప్రమాదం జరిగినా వారికి ఆర్థిక సహకారం కోసం 1991లో ఉమ్మడి రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న కల్లుగీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా మూసేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కింది. తాము అధికారంలోకి వస్తే దశలవారీ మద్యనిషేధం విధిస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చీప్ లిక్కర్ ఎన్నీటైం, ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా అమ్మిస్తూ కల్లు అమ్మకాలను పూర్తిగా దెబ్బతీసింది. హర్యానా, గోవా, కర్నాటక, యానాం, అస్సాం తదితర రాష్ట్రాల నుండి అక్రమ మద్యం వరదలా మన రాష్ట్రానికి వస్తున్నా ప్రభుత్వం అరికట్టలేకపోతుంది. నాటుసారా, మొబైల్ బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మద్యం, చీప్‌లిక్కర్ దెబ్బకు కల్లు అమ్మకాలు లేక గీత కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో గీత వృత్తిని, సంక్షేమం, ఉపాధి, వృత్తి రక్షణ వగైరా గురించి వైసిపి ప్రభుత్వం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఈ రోజు నమ్ముకున్న వృత్తిలో బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రరాష్ట్రంలో వృత్తిలో బతకలేక నగరాలకు, ఇతర దేశాలకు వలసలు పోతున్నారు. విసుగు చెందిన సీనియర్ గీత కార్మికులు మన వృత్తికి ఇదేం ఖర్మ అంటూ ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అంటున్నారు. కల్లుగీత సామాజిక తరగతులకు చెందిన ఎంఎల్‌ఎలు, ఎంపీలు, మంత్రులు తాము ఇన్ని అవమానాలకు గురౌతుంటే ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారని గీత కార్మికులు మదన పడుతున్నారు. పదవులను కాపాడుకోవడం కోసం కులాలను చీల్చడం, గీత కార్మికులను అవమానాలు పాల్జేయడం మంచిది కాదు. ప్రభుత్వానికి గీత కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే మన పక్క రాష్ట్రాలు ఆదుకున్నట్లుగా పథకాలు ప్రవేశపెట్టి ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు చేపట్టాలి.

2022 అక్టోబరు 31న ఎక్స్‌గ్రేషియో పది లక్షలు ఇస్తామని ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించి తొమ్మిది నెలలైనా విధివిధానాలు ప్రకటించ లేదు. తాటి, ఈత చెట్లు నరికి వేస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. చెట్లకు రక్షణ కల్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి ఆధునికీకరణ చేసే విధంగా ఆలోచించాలి. వృత్తి రక్షణ, సామాజిక భద్రత కల్పించాలి. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పాలి. కల్లుగీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించి గీత కార్మికుల సంక్షేమానికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలి. వృత్తిలో ప్రమాదాలు నివారించేందుకు సేఫ్టీ మోకులు తయారు చేయించి ఉచితంగా ఇవ్వాలి. ఎక్కడ ప్రమాదాలకు గురై చనిపోయినా, అంగవైకల్యానికి గురైనా ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి. గీత కార్మికులందరికీ ప్రమాదబీమా చెల్లించి, వైఎస్ఆర్ గీత కార్మిక భరోసా ఇవ్వాలి. వృత్తిలో ప్రమాదవశాత్తు దెబ్బలు తగిలిన వారికి వైద్య ఖర్చులకు రూ.15 వేలు, చనిపోయిన వారి దహన ఖర్చులకు రూ.25 వేలు కార్పొరేషన్ నుండి తక్షణమే ఇవ్వాలి. వృత్తి చేసే వారందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలి. వృత్తి లేని సమయంలో 50 శాతం సబ్సిడీపై రూ.2 లక్షలు ఇవ్వాలి. కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. తాటి, ఈత చెట్లు పెంచుకునేందుకు సొసైటీలకు జిఒ 560 ప్రకారం ఐదెకరాల భూమి ఇవ్వాలి. తాటి, ఈత, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టిచెట్లు ప్రభుత్వమే ఇవ్వాలి.

కల్లుగీత కార్మిక సంఘం ఉద్యమ నిర్మాత ఎస్ఆర్.దాట్ల 44వ వర్ధంతి స్ఫూర్తితో గీత కార్మికులు ఐక్యంగా పోరాడాలి. పోరాడితేనే వృత్తిని రక్షించుకోగలం. ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టగలం.

-జుత్తిగ నరసింహమూర్తి,
ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు

నేడు ఎస్ఆర్ దాట్ల 44వ వర్ధంతి సభ

పెనుమంట్ర: ఎస్ఆర్ దాట్ల 44వ వర్ధంతి సభ ఈ నెల 31న పెనుమంట్రలో నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కూసంపూడి సుబ్బరాజు తెలిపారు. ఆయన 44వ వర్ధంతిని పురస్కరించుకుని బ్రాహ్మణచెరువులో చింతపల్లి శ్రీరాములు స్మారక బస్టాండ్ నుండి పెనుమంట్ర ఎస్ఆర్ దాట్ల స్తూపం వరకు ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్తూపం వద్ద నిర్వహించే సభను జయప్రదం చేయాలని, ఈ సభకు ముఖ్యవక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం పాల్గొంటారని తెలిపారు. ఎస్ఆర్ దాట్ల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ ఈ లిమిటెడ్ ఎమ్‌డి మహిమ దాట్ల సహకారంతో ఉచిత మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఎస్ఆర్ దాట్ల ట్రస్ట్ సభ్యులు చిలుకూరి రాఘవరావు పాల్గొంటారని తెలిపారు. మార్టేరుకు చెందిన సాయి వెంకటేశ్వర హాస్పిటల్ డాక్టర్ కె.సాయిహర్ష సలహాల మేరకు మందులు ఇస్తామని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానాలతో జగన్ పాలన

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - ఆచంట

అంబేద్కర్ ఆలోచన విధానాలతో సిఎం జగన్ పాలన చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఆరుగొలనులో గురుకుల పాఠశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన రాజమహేంద్రవరం వెళ్తున్నారు. ఈ క్రమంలో దొంగరావిపాలెం బ్రిడ్జి వద్ద ఆయనకు ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో వైసిపి నేతలు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు నాయకత్వంలో మరోసారి వైసిపి జెండా ఎగురవేయాలని కోరారు.



మృతుని కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పివిఎల్

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి పివిఎల్ సాయం

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. గరగపర్రు ఉప్పరగూడెం, ఉండి మండలం మహదేవపట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా గొల్లలకోడేరు గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఉప్పరగూడెంకు చెందిన కాలా శ్రీనివాస్, చింతపల్లి మాణిక్యాలరావు గాయాలపాలవ్వగా చింతపల్లి శ్రీనివాస్ మృతి చెందాడు. ఆదివారం ఉప్పరగూడెంలో పర్యటించిన పివిఎల్ బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన చింతపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. పివిఎల్‌తో పాటు సచివాలయ గృహ సారధుల మండల కో-ఆర్డినేటర్ పి.రాధాకృష్ణ ఉన్నారు.

ఓటు ప్రాముఖ్యతను గుర్తించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు ప్రాముఖ్యతను గుర్తించి ప్రతిపౌరుడు ఓటు నమోదు చేసుకుని స్పష్టత కలిగిన ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధిని ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్గ దర్శకమని భీమవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ జి.గిరిధర్‌కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు నమోదు ఓటు విలువ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ ప్రచారం చేయడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అనేకమంది నిర్లక్ష్య ధోరణితో ఓటు నమోదు చేసుకోకపోవడం దురదృష్టకరమని, ఓటు నమోదు నిరంతర ప్రక్రియ అని అన్నారు.

'మహిళా సర్పంచిని అవమానించడం దారుణం'

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రొటోకాల్ విషయంలో బిసి మహిళా సర్పంచిని అవమానపరచడం దారుణమని అగ్నికుల క్షత్రియుల సంఘం మండల నాయకులు మల్లాడి ధర్మారావు అన్నారు. ఈ మేరకు యలమంచిలి సహకార సంఘం భవనం వద్ద ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ యలమంచిలి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనం శిలాఫలకంలో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధుల అందరి పేర్లను రాయించి గ్రామ ప్రథమ పౌరురాలైన బిరై మేరీ పేరును విస్మరించడం దారుణమన్నారు. సొసైటీ కార్యదర్శి కావాలనే మేరీ పేరును విస్మరించారన్నారు. ఆయన మొదటి నుంచి అగ్నికుల క్షత్రియులపై చాలా వివక్ష చూపిస్తున్నారన్నారు. శిలాఫలకంలో మేరీ పేరును రాయించి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పెదపుల్లేరు సర్పంచికి పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరు సర్పంచి కరణం పార్వతీవెంకటేశ్వరరావును డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ఆదివారం పరామర్శించారు. ఇటీవల కరణం పార్వతీవెంకటేశ్వరరావు కుటుంబానికి చెందిన కరణం సింహాచలం, కరణం లక్ష్మి మృతి చెందారు. వారి చిత్రపటాలకు పివిఎల్.నరసింహరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

లోతట్టు ప్రాంతవాసులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎవరూ ఆందోళన చెందవద్దని, వరద ఉధృతి తగ్గుముఖం పట్టిందని, ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. అధిక వర్షాల వల్ల వరద తాకిడికి నీట మునిగిన నరసాపురం మండలంలోని కొత్త నవరసపురం ఎవిటి కాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. కాలనీ వాసులకు 25 కేజీల బియ్యం, కేజీ ఆయిల్, కేజీ కందిపప్పు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధా కృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, ఆంధ్రజ్యోతి చల్లారావు, శ్రీను, సర్పంచి ఈదా జగ్గీవనరావు, ఎంపిటిసి సభ్యులు ప్రసన్నకుమార్, శంకర్, సుందరశేఖర్, ఈద రాజబాబు, సువర్ణరాజు, తహశీల్దార్ ఫాజిల్ పాల్గొన్నారు.

వశిష్ట లియో క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం :యువత లయనిజంలో ముందుండటం, సేవల్లో పోటీ పడటం అభినందనీయమని తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ చైర్‌పర్సన్ లయన్ కె.ఎన్ హనుమాన్ అన్నారు. డైమండ్స్ లయన్స్ మెంబర్ శ్రీ.సత్యనారాయణరావు సౌజన్యంతో లార్డ్స్ ఆఫ్ ఫ్లెక్ చిల్డ్రన్ హోం విద్యార్థులకు స్నాక్స్, స్వీట్లు, భోజనం అందించారు. లియో క్లబ్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు లియో మాధురి లియో సంపత్ ఆధ్వర్యంలో పిల్లలకు కావాల్సిన అవసరాలు పరిశీలించారు డైమండ్స్ లయన్స్ సహకారంతో వాటిని అందించడం స్ఫూర్తిదాయకం అని హనుమాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి, సతీష్, రాజేష్, యర్రా ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం : జనసేన

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీ స్థాపించి పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలు అందిస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మి పార్టీ నియోజకవర్గ నాయకురాలు నాగరాజు అన్నారు. మండలంలోని సీసలి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో 'జనంలోకి జనసేన' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పేదలకు నిత్యావసర వస్తువులు అందించారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరాలపై దాడి

ఉండి :మండలంలోని పెదపుల్లేరు, యండగండి గ్రామాల్లో పేకాట స్థావరాలపై ఉండి పోలీసులు దాడి చేసి పదమూడుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,190 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రానున్న కాలంలో పోరాటానికి సిద్ధపడాలి

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపు

యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎపిఇపిడిసిఎల్ డిస్కం అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులేషన్, మీటర్ల సమస్యలు, ఉద్యోగుల పిఆర్‌సి డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో పోరాటానికి సిద్ధపడాలని యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎపిఇపిడిసిఎల్ డిస్కం అధ్యక్షులు జె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం పోరాట కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలకు అన్ని రకాల ఉద్యోగులు, ప్రజా సంఘాలు మద్దతు అందించాలని పోరాట కమిటీ కోరింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎఐటియుసి జిల్లా నాయకులు రంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా మాట తప్పారని విమర్శించారు. విద్యుత్‌కు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న మీటర్ రీడర్లను ముంచారన్నారు. 18 నెలల నుంచి విద్యుత్ శాఖలో ఉద్యోగులకు పిఆర్‌సి ఇవ్వకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. కాంట్రాక్టు, శాశ్వత ఉద్యోగులు, మీటర్ రీడర్లు, జెఎల్ఎంల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడనాడాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీని చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యోగులు చేసే పోరాటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగుల దశలవారి పోరాటానికి సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి పూర్తి సంఘీభావాన్ని మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు మహేష్, ఎం.నాగరాజు మాట్లాడుతూ 2018లో 14 రోజుల సమ్మె సందర్భంగా అరకొర జీతాలు పెంచి సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి కార్మికులను మోసం చేసిందన్నారు. మీటర్ రీడర్స్ సంఘం జిల్లా నాయకులు వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మీటర్ రీడర్లకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడంలేదన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ భీమవరం డివిజన్ కార్యదర్శి సిహెచ్.కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ 31వ తేదీన కలెక్టర్‌కి వినతిపత్రం, వచ్చే నెల రెండో తేదీన ఏలూరులో ధర్నా, పదో తేదీన ఎపి డిసిఎం విశాఖపట్నంలో నిర్వహించే ధర్నాలో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే ఏ సమయంలోనైనా సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఆంజనేయులు, విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు తిరుపతయ్య, పవన్‌కల్యాణ్, శేఖర్, రమణ, సత్యనారాయణ, సుభాష్ చంద్రబోస్, సుబ్రహ్మణ్యస్వామి పాల్గొన్నారు.

పాలకొల్లులో తగ్గని భారీ ఈదురుగాలులు

ప్రజాశక్తి - పాలకొల్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తగ్గినప్పటికీ పాలకొల్లులో ఆదివారం కూడా భారీ ఈదురు గాలులు వీచాయి. వర్షం లేదు కాని గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయి. మరో అల్పపీడనం పొంచి ఉందని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - పాలకోడేరు

ముచ్చటగా మూడోసారి ఆత్మీయంగా కలుసుకొని ఒక్కసారిగా బాల్య ప్రపంచంలోకి వెళ్లిపోయారు ఆ పూర్వపు విద్యార్థులు. 38 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు రోజుల పాటు 1984-85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం ఒకరికొకరు బహుమతులు పంచుకుని, బరువెక్కిన హృదయంతో వీడ్కోలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గులిపల్లి సత్యనారాయణ, పూడివలస సత్యనారాయణ, చెల్లబోయిన రాము, పూడి నాగమల్లేశ్వరరావు, శ్రీనివాస్, జాన్సన్, ఆశీర్వాదం, మురళి పాల్గొన్నారు.

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. మండల కేంద్రమైన మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1987- 88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

జగనన్న కాలనీ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెగ్గిపూడి శివారు వనంపల్లి జగనన్న కాలనీ లేఅవుట్ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేశారు. కాలనీలో రోడ్ల అధ్వానంపై జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్ శనివారం విమర్శలు చేశారు. దీంతో స్పందించిన అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

మానవత సంస్థ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - గణపవరం

మానవత సంస్థ సేవలు ఎనలేనివని హైదరాబాద్‌కు చెందిన సింగులూరి రామకృష్ణ అన్నారు. ఫ్రీజర్ కొనుగోలు చేసేందుకు సంస్థ రీజియన్ ఛైర్మన్ కాకర్ల వినాయకకు రామకృష్ణ రూ.70 వేల చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా వినాయక మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలకు తన మిత్రుడు రామకృష్ణ సహకారం అందించడం అభినందనీయమన్నారు. సంస్థకు ఆర్థిక సాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత మండల నాయకులు వంకాయల రామారావు, జిల్లా నాయకులు సాగిరాజు జానకి రామరాజు, అధ్యక్షులు కంతేటి కృష్ణంరాజు, బుద్దాల పుల్లయ్య, గంటా అన్నవరం, అచ్చారావు పాల్గొన్నారు.

పెనుగొండ :మానవత సంస్థ సేవలు అభినందనీయమని ఇలపర్రు సర్పంచి దండు పద్మావతి అన్నారు. మానవత పెనుగొండ మండల శాఖ సమావేశం ఇలపర్రులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పద్మావతి మాట్లాడుతూ మానవత సంస్థ ఇటువంటి సేవలు మరెన్నో చేయాలన్నారు. అనంతరం మానవత సంస్థకు పలువురు విరాళాలు అందించారు.

ఉత్తరపాలెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉత్తరపాలెంలో తక్షణమే యుద్ధప్రాతిపదికన వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం కాపాడాలని సిపిఎం నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోవడం, తాగునీరు కలుషితమవ్వడంతో స్థానికులు అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. అనేక మంది విషజ్వరాల బారిన పడి తణుకు, పాలకొల్లు, నవుడూరు, భీమవరం ప్రయివేట్ ఆసుపత్రుల్లో రూ.లక్షలు వెచ్చించి వైద్యం పొందే పరిస్థితులు నెలకొన్నాయన్నారు.. తక్షణమే వైద్యబృందం గ్రామంలో పర్యటించి రోగాల పరిస్థితిని అంచనా వేయాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, గ్రామ శాఖ కార్యదర్శి కేతా జ్యోతిబసు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సక్రమంగా శానిటేషన్ చేయించకపోవడంతో మురుగుకూపాలు దోమలకు, ఈగలకు ఆవాసాలుగా మారాయన్నారు. ఈ పరిస్థితుల వల్లే విషజ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విషజ్వరాలు సోకడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇదే పరిస్థితి మండల వ్యాప్తంగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. అవసరమైన గ్రామాల్లో తక్షణమే వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల రీత్యా సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న అపారశుధ్య పరిస్థితులు నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అవార్డు గ్రహీత రంగసాయికి సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రంగసాయిని సత్కరిస్తున్న పట్టణ స్వచ్ఛంద సంస్థల వక్తలు

సంఘ సేవకులు, నిరంతరం సేవా కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా ఉంటూ 40 ఏళ్లపాటు సమాజ సేవలో ఉంటూ వస్తున్న చెరుకువాడ రంగసాయి ఎపిజె అబ్దుల్ కలాం జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం గొప్ప విశేషమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక క్విట్‌ఇండియా స్థూపం వద్ద పట్టణ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోకస్ నాటక సంస్థ అధ్యక్షులు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, ఎపి ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ నిత్యచైతన్య స్రవంతి రంగసాయి అని, అనునిత్యం సేవా కార్యక్రమా లతోనే జీవితం సాగిస్తున్న రంగసాయి మరెన్నో అవార్డులు అందుకోవాలన్నారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 27న విజయవాడ ఐలపురంలో జరిగిన పిలంత్రోపిక్ అసోసియేషన్ నిర్వహించిన సభలో రంగసాయి ఎపిజె అబ్దుల్‌కలాం జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం గొప్ప విశేషమన్నారు. కె.శిరిష, కె.ఇందిర, ఎస్‌కె.చాన్‌బాషా రంగసాయి సేవలను కొనియాడారు. రంగసాయి మాట్లాడుతూ అందరూ తనను ఆదరించడమే ఈ స్థాయికి కారణమన్నారు. అనంతరం రంగసాయిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.సరోజిని, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు, స్నేహశీలి త్రిమూర్తులు

పుట్టినరోజు వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గంటా త్రిమూర్తులు స్నేహశీలి అని, తోటివారికి సేవ చేయడంలో ముందుంటాడని, పేదలకు నిత్యం అండగా ఉంటాడని టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి అన్నారు. కృష్ణబలిజ రాష్ట్ర కార్యదర్శి, టిడిపి జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు గంటా త్రిమూర్తులు పుట్టినరోజు వేడుకలను టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఆయన్ని సత్కరించారు. పార్థసారధి మాట్లాడుతూ త్రిమూర్తులు మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకుని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, మద్దుల రాము, పంతం సతీష్, విజ్జురోతి రాఘవులు, మైలబత్తుల ఐజాక్‌బాబు, చెల్లబోయిన గోవింద్, దొంగ వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, పెద్దిరాజు, మాదాసు సురేష్, మద్దుల మావుళ్ళ, గంగాధర్ తిలక్, బలముత్యం, విన్నకోట వినాయక్ పాల్గొన్నారు.

మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

చర్మకారుల సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న దళిత చర్మకారుల సమస్యలపై పలుమార్లు జిల్లా స్పందన కార్యక్రమంలో అనేక వినతులు ఇచ్చామని తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ చర్మకారులు సమస్యల పరిష్కారం కోసం మెప్మా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. గత నాలుగు నెలల కాలంలో ఒక్కసారి సమావేశపరిచి దళిత చర్మకారులను మెప్మా అధికారులు కుల వివక్షతో దారుణంగా అవమానించారన్నారు. ఇప్పటివరకు చర్మకారులను కనీసం పట్టించుకోలేదన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశించినా మెప్మా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వర్షాల వల్ల దళిత చర్మకారులు వృత్తి చేసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి రుణాలు, గొడుగులు, బల్లలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెప్మా జిల్లా పీడీ, భీమవరం పట్టణ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గోపి..!

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్‌ను మార్చి గుడాల గోపిని నియమిస్తారని గత పక్షం రోజులుగా నియోజకవర్గంలో వార్త చక్కర్లు కొడుతోంది. వీరవాసరం మండలానికి చెందిన రొయ్యల వ్యాపారి గోపి ఇప్పటికే పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలుసుకున్నట్లు, సిఎం జగన్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. పాలకొల్లు నియోజకవర్గంలో గతంలో గుణ్ణం నాగబాబు, మేకా శేషుబాబు మధ్య తీవ్ర పోటీ ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ వైసిపి తరపున పోటీ చేసి నిమ్మల రామానాయుడు చేతిలో ఓడిపోయారు. దీంతో కొన్నినెలల పాటు డాక్టర్ బాబ్జీ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అనంతరం నియోజకవర్గంలో ఏ నేతకు ఇచ్చిన గొడవలు అవుతాయని వీరవాసరం మండలానికి చెందిన కవురు శ్రీనివాస్‌ను పాలకొల్లు ఇన్‌ఛార్జిగా నియమించారు. గత నాలుగేళ్లుగా కవురు శ్రీనివాస్ వైసిపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ డిసిసిబి ఛైర్మన్, అనంతరం జెడ్‌పి ఛైర్మన్ పదవి చేపట్టారు. ఇటీవల ఎంఎల్‌సి ఎన్నిక అయినప్పటికీ తానే పాలకొల్లుకు ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని పలుమార్లు ఆయన ప్రకటించారు.

దూసుకుపోతున్న నిమ్మల..

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు రాష్ట్రంలో టిడిపి కీలక నేతగా ఎదగడం, అనేక నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తూ జగన్‌పై విమర్శల అస్త్రాలు సంధిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకొల్లు నుంచి బలమైన అభ్యర్థి కోసం కొన్ని నెలలుగా వైసిపి అధిష్టానం కృషి చేస్తోంది. పలుమార్లు మిథున్‌రెడ్డి కూడా పాలకొల్లు వచ్చి కార్యకర్తలతో సమావేశమయ్యారు. పాలకొల్లు నుంచి పోటీ చేయడానికి గుణ్ణం నాగబాబు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ పోటీ చేయడానికి ముందుకొస్తున్నా ఆర్థిక సమస్య కీలకపాత్ర వహిస్తోంది. పాలకొల్లు నుంచి రూ.40 కోట్ల వరకు ఖర్చు చేసే అభ్యర్థి కోసం అధిష్టానం అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలో గోపి ముందుకు వచ్చారు. నియోజకవర్గంలో జగన్ ఇమేజ్‌తో పాటు కీలకమైన శెట్టిబలిజ సామాజిక తరగతి ఓటు బ్యాంకు కలిసి వస్తుందని వైసిపి వర్గాలు చెబుతున్నాయి. నిమ్మల రామానాయుడు గడపగడపకు తిరుగుతూ అన్ని వర్గాలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అత్యధిక మెజార్టీ గెలిచే ఐదు స్థానాల్లో పాలకొల్లు ఉంటుందని వైసిపి వర్గాలే అంగీకరిస్తున్నాయి. గోపి అంజలి మానసిక వికలాంగుల కేంద్రానికి, దాసరి నారాయణరావు ఉమెన్స్ కాలేజీకి విరాళాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఆఫీసు కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. గోపి పేరును అధికారికంగా వైసిపి అధిష్టానం ప్రకటించలేదు. ప్రస్తుతం నియోజకవర్గంలో వైసిపి పరిస్థితి అధ్వానంగా ఉందని పలువురు చెబుతున్నారు. నరసాపురం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుంటే పాలకొల్లులో అభివృద్ధి నత్తనడకన ఉంది.

వ్యాపారుల ఎదుగుదలకు అడ్డుపడుతున్న ఎంఎల్ఎ ప్రసాదరాజు

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

నరసాపురం టౌన్ :నరసాపురం పట్టణంలో స్థానిక వ్యాపారుల ఎదుగుదలకు ఎంఎల్ఎ ప్రసాదరాజు అడ్డుపడుతున్నారని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. స్థానిక రాయిపేట కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పేరుతో నాలుగేళ్ల నుంచి ప్రతి సంవత్సరం షాపులు కొట్టివేస్తూ వారిని ఆర్థికంగా దెబ్బతీస్తున్నారన్నారు. డ్రెయినేజీ నిర్మాణం పేరుతో మూడోసారి షాపులు కొట్టివేయటంపై షాపు యజమానులు మున్సిపల్ కమిషనర్‌కు అభ్యంతరం తెలిపారన్నారు. దీనిపై కమిషనర్‌తో చర్చలు జరిపిన అనంతరం ఒక్క అడుగు లోపలికి తొలగిస్తామని హామీ ఇచ్చారని, దాని ప్రకారం శనివారం షాపులు కొట్టివేశారని తెలిపారు. కాని ఎంఎల్ఎ ఒత్తిడితో అర్ధరాత్రి భారీ పోలీసు బలగాలతో, మున్సిపల్ అధికారులు మళ్లీ మార్కింగ్ వేసి తొలగించడానికి ప్రయత్నించారన్నారు. అన్యాయంగా షాపులు కొట్టటానికి వీలులేదని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని మున్సిపల్, పోలీసు అధికారులకు చూపించినా తనపై, తన కార్యకర్తలపై పోలీసు జులుం చూపించి అక్రమంగా అరెస్ట్ చేసి, షాపుల ఎదుట అరుగులను తొలగించారన్నారు. కేసులు పెడితే భయపడేది లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం : చీఫ్ విప్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆదివారం ఆయన గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ లే అవుట్ పూడిక పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు.

'జగనన్న కాలనీలో రోడ్లు అధ్వానం'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పండితవిల్లూరు గ్రామంలో జగనన్న కాలనీలను జనసేన నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులైన రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ రావిహరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ మూడో ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. కాలనీల్లో రోడ్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసారు. అనంతరం నీటితో నిండిన మట్టి రోడ్లపై కాగితపు పడవులు వేసి నిరసన తెలిపారు.

ఆకివీడు సిఐగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు సిఐగా కె.సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం స్పెషల్ బ్రాంచ్ సిఐగా ఉన్న ఆయన ఆకివీడు బదిలీ అయ్యారు.

'వైసిపి హయాంలో మహిళలకు రక్షణ కరువు'

ప్రజాశక్తి - ఉండి

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని చంద్రబాబు నాయుడుతోనే అది సాధ్యమని ఉండి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ అన్నారు. మండలంలోని చిలుకూరు గ్రామంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కన్నెగంటి రూత్ కళ పాల్గొని మాట్లాడారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి జరగడమే కాకుండా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, పెద్దింటి నాగలక్ష్మి, వేగేశ్న అనంతలక్ష్మి, కోలా రామారావు, భీమరాజు పాల్గొన్నారు.

'మాధవ నాయుడు అరెస్టు సరికాదు'

ఉండి :నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అరెస్టు సరికాదని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు తీవ్రంగా ఖండించారు. ఆదివారం బండారు మాధవనాయుడును పరామర్శించినట్లు హరినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదన్న విషయం వైసిపి నాయకులు, నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు తెలుసుకోవాలన్నారు. కొన్నిరోజులుగా స్టీమర్ రోడ్డులో డ్రెయినేజీ నిర్మించే విషయమై అక్కడి షాపు యజమానులకు పురపాలక సంఘానికి జరుగుతున్న చర్చల్లో భాగంగా బండారు మాధవనాయుడు షాపు యజమానులకు మద్దతుగా మాట్లాడుతున్నారన్నారు. అది సహించలేని ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు శనివారం రాత్రి పోలీసు బలగాలతో విచక్షణారహితంగా బండారుమాధవ నాయుడిపై, వారి అనుచరులపై దాడి చేయించడం దారుణమని పేర్కొన్నారు.

మహారాజశ్రీ భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 260/2022
ఓ.ఎస్.నెం. 147/2020

పిటీషనరు /వాది:
యర్రంశెట్టి వీరాంజనేయులు

రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
1) కందుల రత్న కుమారి
2) కందుల సంధ్య

ఆర్డర్ 5 రూల్ 20 సి.పి.సి. ప్రకారం రెస్పాండెంట్లుకి నోటీసు

పై నెంబరు దావాలో 1,2 రెస్పాండెంట్లు /ప్రతివాదులుకి కోర్టు వారు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినా అమలు జరుగనందున **దీ. 07-08-2023 తేదీన పై కోర్టు వారు ఎదుట 10 గంటలకు హాజరు కావాలని, లేని పక్షంలో 1,2 రెస్పాండెంట్లు /ప్రతివాదులు పరోక్షంలో తీర్మానించబడునని తెలియచేయడమైనది.**

మోగంటి శివకృష్ణ
పిటీషనరు /వాది తరుపు అడ్వకేట్, భీమవరం.
భీమవరం,
31-7-2023. సెల్: 98485 39039

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/డి.బి తేది.28-07-2023

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం. 5(1-4) BHI/ జనరల్/ 2023-24/E1/E2 లోని జనరల్ ఫండ్స్ నుండి 4 పనులకు సంబంధించి రూ. 19.10 లక్షలకు గాను ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్. నెం. 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వో.ల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
భీమవరం పురపాలక సంఘం